పై మూడు ప్రాథమిక అంశాలను దృష్టిలో ఉంచుకుని ఎవరైనా ఖుర్‌ఆన్‌ను అధ్యయనం చేస్తే, వారికి ఈ విషయాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.

ఈ గ్రంథం దాని ఇతివృత్తం నుండి, దాని ఆశయం నుండి, దాని ప్రధాన విషయం నుండి ఇసుమంతమయినా తొలగలేదు. ఒకే హారంలోని రకరకాల, రంగు రంగుల వజ్రాలు పొందికగా, పటిష్టంగా పొదగబడి ఉన్నట్లే ఖుర్‌ఆన్‌లోని అనేక ఉపవిషయాలు తొలి నుంచి తుది వరకు దాని ప్రధాన విషయంతో పెనవేసుకుని ఉన్నాయి. ఖుర్‌ఆన్, భూమ్యాకాశాల నిర్మాణాన్ని, మానవ సృష్టిని, సృష్టిలోని నిదర్శనల పరిశీలనను, గతించిన మానవ జాతి చరిత్రను ప్రస్తావిస్తుంది; విభిన్న మానవ సమాజాల విశ్వాసాలను, నీతీ నియమాలను, ఆచార వ్యవహారాలను విమర్శిస్తుంది; లోకోత్తర విషయాలను, సమస్యలను, విశదీకరిస్తుంది; ఇంకా ఎన్నో విషయాలను కూడా చర్చిస్తుంది. కాని భౌతిక శాస్త్రాన్నీ, చరిత్రను, తత్వశాస్త్రాన్నీ లేదా ఇంకేదయినా శాస్త్రాన్ని గాని, కళనుగాని మానవుడికి బోధించటం దాని లక్ష్యం కాదు. దీని లక్ష్యం కేవలం సృష్టి వాస్తవికత పట్ల మానవుడికున్న అపార్థాలను తొలగించటం. అసలు యదార్థాన్ని సుబోధకం చెయ్యడం, వాస్తవికతకు విరుద్ధమయిన వైఖరిని అవలంబించటం వల్ల కలిగే కీడును, చెడు పరిణామాలను వివరించటం, వాస్తవికతకు అనుగుణంగా ఉన్న, మంచి పరిణామానికి దోహదం చేసే వైఖరి వైపునకు మానవుల్ని ఆహ్వానించటం. ఈ కారణం చేతనే దాని లక్ష్యానికి అవసరమయిన మేరకు అనువైన పంథాలో మాత్రమే, ప్రతి విషయాన్నీ అది ప్రస్తావిస్తుంది. ఈ విషయాలను తన అవసరం మేరకు ప్రస్తావించి తరువాత సందర్భ శుద్ధిలేని వివరాలను వదిలేసి, అది దాని ఆశయం వైపునకు, దాని ప్రధాన విషయం వైపునకు మళ్ళుతుంది. ఇక దాని వివరణలు 'ప్రధాన సందేశం' చుట్టూ ఎంతో పొందికగా, మనోజ్ఞంగా పరిభ్రమిస్తూ ఉంటాయి.

## పూర్వరంగం

ఖుర్‌ఆన్ శైలిని, దాని క్రమాన్ని, అందులోని ఎన్నో విషయాలను

అటువంటప్పుడు, ధర్మాధర్మాల పోరాటంలో, ఇస్లామ్ మరియు అజ్ఞానాల సమర రంగంలో మీరసలు అడుగుపెట్టకనేపోతే సంఘర్షణలోని ఏ దశనైనా ఎదుర్కునే సందర్భమే మీకు తటస్థపడకపోతే, కేవలం ఖుర్‌ఆన్ వచనాలను వల్లిస్తూ ఉన్నంతమాత్రాన, అందులోని నిగూఢ సత్యాలన్నీ మీ ఎదుట ప్రత్యక్షమవటం ఎలా సంభవం? ఖుర్‌ఆన్‌ని మీరు కూలంకషంగా అర్థం చేసుకోగలగాలంటే, దీన్ని చేతబూని లేచి నిలవాలి. దైవం వైపునకు ఆహ్వానించే కార్యాన్ని ప్రారంభించాలి. ఏ ఏ బాటలపై ఈ గ్రంథం మిమ్మల్ని నడిపిస్తుందో ఆ ఆ బాటలపై నడుస్తూ పురోగమించాలి. అప్పుడే ఖుర్‌ఆన్ అవతరణా కాలంలో ఎదురయిన అనుభవాలు మీకు ఎదురవుతాయి. మక్కా, అబిసీనియా, తాయిఫ్‌లాంటి మలుపుల్ని మీరు చూడగలుగుతారు. బద్ర్,[1], ఉహద్[2]ల నుండి హునైన్,[3] తబూక్[4]ల వరకు అన్ని దశలూ మీ ఎదుట నిలుస్తాయి; అబూ జహల్,[5] అబూలహబ్[6]లు కూడ తటస్థపడతారు. కపటులు (మునాఫిక్‌లు), యూదులు కూడ ప్రత్యక్షమవుతారు. "సాబిఖూనుల్ అవ్వలూన్"[7] నుండి "మఅల్లఫతుల్ కులూబ్"[8] వరకు అన్ని రకాల మానవుల నమూనాలను మీరు వీక్షిస్తారు. వీరిలోనే మసలుతారు, వీరిని ఉద్యమ కార్యాల్లో వినియోగించుకుంటారు కూడా. ఇది విలక్షణమయిన 'సులూక్' (యోగపథం). దీన్ని నేను "సులూకే ఖురానీ" (ఖుర్‌ఆన్ యోగపథం) అంటాను. ఈ యోగ పథంలోని మహత్తు ఏమిటంటే, మీరు ఒక్కొక్క దశను దాటుతూ ఉంటే, ఖుర్‌ఆన్‌లోని కొన్ని ఆయత్‌లు (వాక్యాలు), కొన్ని సూరాలు (అధ్యాయాలు)

---

1,2,3,4 – ఇస్లామీయ ఉద్యమంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు ఎదురయిన సాయుధపోరాటాలు.

5,6 – మక్కాలో ఇస్లామీయ ఉద్యమాన్ని ఎదిరించిన వారిలో అగ్రగణ్యులు

7. ఇస్లాం స్వీకారం విషయంలో అగ్రగాములు.

8. (ఉద్యమం – చివరి దశలో) ఇస్లాంను స్వీకరించిన నిర్ధనులయిన వారికి ఆర్థిక సహాయం చెయ్యటం.

